సాక్షి అన్నమయ్య జిల్లా

మంగళవారం । 23 । జూలై । 2024



కొత్త బంగారు లోకం

ఇడుపులపాయ ఆర్కేవ్యాలీ ట్రిపుల్ ఐటీలో సోమవారం కొత్తగా ఎంపికైన విద్యార్థిని, విద్యార్థులకు అడ్మిషన్ల ప్రక్రియ నిర్వహించారు. - 8లో



ఎర్రచందనం దుంగల స్వాధీనం

సుండుపల్లి మండలం కావలిపల్లి రాయవరం సెక్షన్ వద్ద మామిడితోటలో టాస్క్‌ఫోర్స్ పోలీసులు ఏడు ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకున్నారు. - 8లో

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.560	రూ.660
రెండోరకం	రూ.420	రూ.540



మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 986 మెట్రిక్ టన్నులు

పట్టుగూళ్ల ధరలు (రూ.లో)

రకం	కనిష్టం	గరిష్టం
బైవోల్టిన్	432	456
సీబీ	-	-



మార్కెట్‌కు వచ్చిన పట్టుగూళ్లు : 263.540 కిలోలు

గళమెత్తాలి.. దశ మార్చాలి

- సోమవారం నుంచి ప్రారంభమైన అసెంబ్లీ సమావేశాలు
- జిల్లా అభివృద్ధికి ఎమ్మెల్యేలు గళం విప్పాలి
- పరిశ్రమలే మార్గం.. ఉపాధికి ఊతం
- జిల్లాలో అనేకచోట్ల ఏపీఐఐసీ పార్కులు
- సాగునీటి ప్రాజెక్టుల పూర్తికి నిధులు అవసరం
- జాతీయ రహదారుల పనుల్లో వేగం పెంచాలి







ఆకేపాటి అమరనాథరెడ్డి



షాజహాన్ బాషా



ద్వారకనాథరెడ్డి



రాంప్రసాద్‌రెడ్డి



కిషోర్‌కుమార్‌రెడ్డి



అరవశ్రీధర్

సాక్షి రాయచోటి : అన్నమయ్య జిల్లా...కరువుకు ఖిల్లా...ఇలాంటి చోట పరిశ్రమలతో ఉపాధికి పెద్దపీట వేసేందుకు ప్రణాళికలు రూపొందించాలి. జాతీయ రహదారుల పనులు మొదలుకొని సాగునీటి ప్రాజెక్టుల పూర్తికి నిధులు తీసుకొచ్చేలా కృషి చేయాలి. జిల్లాలో ప్రతిసారి కరువు పరిస్థితులతో వ్యవసాయం పూర్తిగా దెబ్బతింటున్న పరిస్థితుల్లో వ్యవసాయాధారిత పరిశ్రమలతోపాటు ప్రత్యేకంగా గ్రానైట్, మంగంపేట బెరైటీస్, చేనేత పరిశ్రమ, కొయ్యబొమ్మలు, మట్టిబొమ్మల తయారీలో జిల్లాకు విశేష గుర్తింపు ఉంది. అంతేకాకుండా ఏపీఐఐసీ ఆధ్వర్యంలో జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లో పారిశ్రామిక పార్కుల్లో స్థలముంది. పునర్విభజనలో భాగంగా ఏర్పడిన జిల్లాకు సంబంధించి అభివృద్ధి పనులతోపాటు జిల్లా కేంద్రమైన రాయచోటిలో ప్రముఖ విద్యా సంస్థలను తీసుకు రావడం మొదలు అనేక అభివృద్ధి పనులు చేయాల్సి ఉంది. ఈ తరుణంలో సోమవారం నుంచి అసెంబ్లీ సమావేశాలు ప్రారంభమైన నేపథ్యంలో జిల్లాకు చెందిన రవాణాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డితోపాటు జిల్లాలోని ఎమ్మెల్యేలందరూ గళం విప్పాలని జిల్లా వాసులు కోరుతున్నారు.

జాతీయ రహదారుల పనులను వేగవంతం చేయాలి

జిల్లాలోని జాతీయ రహదారుల పనులను వేగవంతం చేయడం ద్వారా వాహనదారులకు సౌకర్యాలు ఒనగూరుతాయి. ప్రధానంగా రేణిగుంట నుంచి కడప గ్రీన్‌హైవే పనులు ఆరు నెలల కిందటే రాజంపేట వద్ద ప్రారంభమయ్యాయి. వీటితోపాటు తిరుపతి–మదనపల్లె–పీలేరు, కర్నూలు–చిత్తూరు ప్రధాన రహదారి విస్తరణ, రాయచోటి–వేంపల్లె, వేంపల్లె–ప్రొద్దుటూరు–చాగలమర్రి రహదారుల పనులను వేగవంతం చేసేలా చర్యలు చేపట్టడంతోపాటు నిధులు స్పీడుగా అందించడం అవసరం. అంతేకాకుండా గ్రామీణ ప్రాంతాల్లోనూ రోడ్లు దెబ్బతిన్న నేపథ్యంలో మరమ్మతులు ఎంతో అవసరం.


జిల్లా కేంద్రం అభివృద్ధికి నిధుల అవసరం

అన్నమయ్య జిల్లాగా రూపుదిద్దుకున్న రాయచోటిలో అనేక అభివృద్ధి పనులకు నిధులు అవసరం. కొత్త కలెక్టరేట్‌తోపాటు వివిధ విద్యా సంస్థలు, కేంద్రీయ విద్యాలయం, పీజీ కళాశాల ఇలా చెబుతూ పోతే అనేక అభివృద్ధి పనులు చేపట్టాల్సి ఉంది. మున్సిపాలిటీలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, తాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టాలి. తంబళ్లపల్లె ప్రాంతంలో వాటర్ గ్రిడ్‌ను పూర్తి చేసే దిశగా అడుగులు వేయాలి. అన్నమయ్య జిల్లా కేంద్రానికి సంబంధించి శిల్పారామం, నగరవనం, ఇతర అభివృద్ధి పనులు చేపట్టాలంటే నిధుల ఆవశ్యకత ఉంది.

సాగునీటి ప్రాజెక్టుల పనుల పూర్తికి పట్టుబట్టాలి

అన్నమయ్య జిల్లా సస్యశ్యామలం కావాలంటే సాగునీటి అవసరం చాలా ఉంది. దీనికి సంబంధించి వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో హంద్రీ–నీవా, గాలేరు–నగరి ప్రాజెక్టులకు సంబంధించి కాలువలు అన్నమయ్య జిల్లా మీదుగా వెళుతున్నాయి. ఇందుకు సంబంధించి గాలేరు–నగరి ప్రాజెక్టు కెనాల్స్ సుమారు రూ. 540 కోట్లతో పనులు జరుగుతుండగా, హంద్రీ–నీవాకు సంబంధించి రూ. 1240 కోట్లకు పైగా అగ్రిమెంట్లు పూర్తి చేసుకుని పనులు చేపడుతున్నారు. ఇలాంటి తరుణంలో ఎక్కడికక్కడ నిధులను తీసుకు రావాల్సిన అవసరం ఉంది. గత రెండేళ్ల క్రితం కొట్టుకుపోయిన అన్నమయ్య ప్రాజెక్టు పునర్ నిర్మాణం మొదలుకొని పింఛా ప్రాజెక్టు పూర్తి చేసేలా నిధులు పూర్తి స్థాయిలో మంజూరు చేయాలి. అలాగే ముదివీడు, శ్రీనివాసపురం రిజర్వాయర్లను పూర్తి స్థాయిలో నీటితో నింపడం.. జిల్లాలోని అన్ని చెరువులను నీటితో నింపేలా ప్రణాళికలు రూపొందించేలా జిల్లా ఎమ్మెల్యేలంతా అసెంబ్లీలో వాణి వినిపించాలని జిల్లా ప్రజలు ఆశిస్తున్నారు.

పరిశ్రమలకు రాచబాట



జిల్లాలో పరిశ్రమలు ఏర్పాటు చేసేందుకు అనువైన వసతులు ఉన్నాయి. ప్రధానంగా మంగంపేట బెరైటీస్ దేశంలోనే ప్రసిద్ధి చెందింది. పుల్లరిన్ నిక్షేపాలు ఉన్నట్లు కూడా నిర్ధారించారు. ఇలాంటి పరిస్థితుల్లో పెద్ద ఎత్తున బెరైటీస్‌తోపాటు పుల్లరిన్ వెలికి తీస్తే భారీగా ఆదాయం జిల్లాకు ఒనగూరనుంది. మదనపల్లె ప్రాంతంలో గ్రానైట్ పరిశ్రమలు ఉన్నాయి. దీనిపై ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటే పలు పరిశ్రమలు వచ్చేందుకు అవకాశం ఉంది. మదనపల్లెలో మట్టిబొమ్మల తయారీతోపాటు నీరుగట్టుపల్లె ప్రాంతంలో ప్రసిద్ధి చెందిన చేనేత వస్త్రాలు తయారు చేస్తున్నారు. సిద్దవటం మండలం మాధవరంలో చేనేత మగ్గాల ద్వారా ప్రపంచ పేరెన్నికగన్న వస్త్రాల తయారీ యూనిట్లు ఉన్నాయి. మదనపల్లె, గుర్రంకొండ, చిన్నమండెం, తంబళ్లపల్లె ప్రాంతాల్లో టమాటా మార్కెట్ ప్రసిద్ధి చెందింది. ప్రధానంగా మదనపల్లెతోపాటు చుట్టుపక్కల ప్రాంతాల్లో టమాటా ఆధారిత పరిశ్రమలు..రాజంపేట, రైల్వేకోడూరు ప్రాంతంలో బొప్పాయి, అరటి ఆధారిత పరిశ్రమలను నెలకొల్పితే చాలా ప్రయోజనం ఉంటుంది. అంతేకాకుండా నిరుద్యోగ యువత ఉపాధి అవకాశాలు పెరగనున్నాయి. జిల్లాలో పీలేరులో ఏపీ ఐఐసీ పార్కులో పరిశ్రమలు పెట్టేందుకు అనువైన పరిస్థితులు ఉన్నాయి. జాతీయ రహదారికి ఆనుకుని ఉండడం కూడా కలిసొచ్చే అంశం.

సోమశిల బ్యాక్ వాటర్‌పై చర్చించాలి



గతంలో సోమశిల బ్యాక్ వాటర్ నుంచి పెనగలూరు, చిట్వేలి మండలాల చెరువులకు నీరు అందించేందుకు ఇరిగేషన్ శాఖ వారు ఎస్టిమేషన్లు పూర్తి చేశారు. గత మూడు సంవత్సరాల నుంచి మండలంలోని చెరువులకు చుక్క నీరు కూడా రాలేదు. అసెంబ్లీ సమావేశాలు జరుగుతున్నందున ఎమ్మెల్యే అరవ శ్రీధర్ సోమశిల బ్యాక్ వాటర్‌పై అసెంబ్లీలో చర్చించాలి. సోమశిల బ్యాక్ వాటర్ నుంచి నీరు తెచ్చినట్లయితే పెనగలూరు, చిట్వేలి మండలాలు సస్యశ్యామలవుతాయి.

– కృష్ణారెడ్డి, రైతు, పెనగలూరు

నిధుల కోసం పోరాడాలి



జిల్లా అభివృద్ధితోపాటు పరిశ్రమల కోసం ఎమ్మెల్యేలు పోరాటం చేయాలి. ప్రధానంగా కరువు ప్రాంతం కావడంతో పరిశ్రమలు తెచ్చేందుకు అసెంబ్లీలో గళం విప్పాలి. ఇతర అనేక రకాల సమస్యలు జిల్లాను వెంటాడుతున్నాయి. వాటి పరిష్కారానికి ప్రతి ఒక్కరూ అసెంబ్లీ వేదికగా మాట్లాడితే జిల్లాకు న్యాయం జరుగుతుంది.

– బుక్కే విశ్వనాథనాయక్, సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు, రాయచోటి

ఆర్‌యూబీని పూర్తి చేయాలి



దాదాపు 20 గ్రామాల ప్రజలకు, వేలాది మంది విద్యార్థులకు ఉపయోగపడనున్న రైల్వే అండర్ బ్రిడ్జి (ఆర్‌యూబీ)ని పూర్తి చేసేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టాలి. కేవలం రూ.1.50 కోట్లు ఖర్చు చేస్తే ఆర్‌యూబీ పూర్తవుంది. రాజంపేటలో ప్రధాన సమస్యల్లో ఒకటైన ఆర్‌యూబీని పూర్తిచేయడంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాల్సిన అవసరం ఉంది.

– కలికిరి వెంకటసుబ్బయ్య, రాజంపేట

హామీలు నెరవేర్చాలి



ఎన్నికల సమయంలో సీఎం చంద్రబాబు సూపర్ సిక్స్ పేరుతో హామీలు గుప్పించారు. వాటన్నింటిని సత్వరమే అమలు చేయాలి. అప్పుడే చంద్రబాబుపై నమ్మకం ఉంటుంది.

– మధు, మదనపల్లె.

ఆంధ్రా భద్రాద్రిని పట్టించుకోండి



ఆంధ్రా భద్రాద్రిగా పేరుగాంచిన ఒంటిమిట్టలో దశాబ్దాలుగా డ్రైనేజీ సమస్య ప్రజలను వేధిస్తోంది. పేరు గొప్ప ఊరు దిబ్బ అన్నట్లుగా పరిస్థితి ఉంది. నూతనంగా ఏర్పడిన ప్రభుత్వం స్పందించి సమస్యను పరిష్కరించాలి.

– చెంచుగార్ల శ్రీనివాసులు, ఒంటిమిట్ట

చెరువుకు నీరు అందించాలి



ఒంటిమిట్ట చెరువులో నీళ్లు లేక ఆయకట్టు కింద ఉన్న పొలాలన్నీ బీడుగా మారిపోయాయి. బోర్లలో భూగర్భ జలాలు తగ్గిపోవడంతో రైతులు పైర్లు వేసేందుకు వెనుకాడుతున్నారు. నిరుపయోగంగా ఉన్న సోమశిల ఎత్తి పోతల పథకాన్ని ఉపయోగంలోకి తీసుకురావాలి. దాని ద్వారా ఒంటిమిట్ట చెరువుకు నీళ్లు అందించి సమస్యను తీర్చాలి.

– తేలూరు సాయినాథ్ రెడ్డి, ఒంటిమిట్ట

అన్నమయ్య ప్రాజెక్టును పునర్ నిర్మించాలి



రాజంపేట పరిసర ప్రాంతాల ప్రజలకు, వేలాది మంది రైతులకు నీటి కష్టాలు లేకుండా ఉండాలంటే అన్నమయ్య ప్రాజెక్టును పునర్ నిర్మించాల్సిన అవసరం ఉంది. గత ప్రభుత్వం అన్నమయ్య ప్రాజెక్టు నిర్మాణానికి చర్యలు చేపట్టింది. ప్రస్తుత ప్రభుత్వం కూడా ఈ బడ్జెట్ సమావేశాల్లోనే నిధులు మంజూరు చేయాలి. ప్రస్తుతం మున్సిపల్ పాలకవర్గం ప్రాజెక్టులో ఫిల్టర్లు వేసి తద్వారా రాజంపేట పట్టణ ప్రజల దాహార్తి తీర్చుతోంది. వర్షాలు కురవకుంటే ఫిల్టర్ల నుంచి నీరు సరఫరా కావడం కష్టతరం అవుతుంది. – కొరముట్ల సుబ్బరాయుడు, చిరువ్యాపారి, రాజంపేట

చేనేతల సమస్యలు పరిష్కరించాలి



ఎన్నికల్లో చేనేతలను ఆదుకుంటామని చెప్పారు. ముఖ్యంగా ఇంటి పన్నులు కమర్షియల్ కాకుండా చూడాలి. సబ్సిడీపై సిల్క్ ఇచ్చే విధంగా చర్యలు తీసుకోవాలి. కరెంటు బిల్లులకు సబ్సిడీ ఇవ్వాలి. చేనేత కార్మికులకు వైద్యపరంగా ఉచితంగా వైద్య సేవలు అందించాలి.

– రాధ, చేనేత కార్మికురాలు, నీరుగట్టువారిపల్లె,

న్యూస్‌రీల్

ఎంఎస్‌ఎఫ్ రాయలసీమ అధ్యక్షుడిగా మలతోటి నరేష్



మలతోటి నరేష్‌ను సత్కరిస్తున్న మాల మహానాడు జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్

పీలేరు రూరల్ : ఎంఎస్‌ఎఫ్ (మాల విద్యార్థి సంఘం) రాయలసీమ జిల్లాల అధ్యక్షుడిగా కలికిరి మండలం అద్దవారిపల్లెకు చెందిన మలతోటి నరేష్ నియమితులయ్యారు. తిరుపతి యూత్ హాస్టల్‌లో సోమవారం మాల మహానాడు జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ యమలా సుదర్శనం అధ్యక్షతన రాయలసీమ జిల్లా కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నరేష్‌కు నియామక పత్రం అందజేశారు.

ప్రజా సమస్యలను వేగవంతంగా పరిష్కరించాలి

– డీఆర్‌ఓ సత్యనారాయణ



ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తున్న డీఆర్‌ఓ సత్యనారాయణ

రాయచోటి : ప్రజా సమస్యల పరిష్కార వేదిక స్వీకరించిన వినతులను వేగవంతంగా పరిష్కరించాలని డీఆర్‌ఓ సత్యనారాయణ అధికారులకు సూచించారు. సోమవారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెసల్ సిస్టం) కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రజలను పదే పదే కార్యాలయాల చుట్టూ తిప్పుకోకుండా పరిష్కరించలేని సమస్యలను లబ్ధిదారునికి వివరిస్తూ వారికి అర్థమయ్యే విధంగా వివరించాలన్నారు. ఈ కార్యక్రమంలో డ్వామా పీడీ మద్దిలేటి, ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్‌ఈ సురేష్ కుమార్, వివిధ శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

బోధనా అభ్యసన సామర్థ్యాలను పెంపొందించుకోవాలి

టీచ్ టూల్ రాష్ట్ర పరిశీలకుడు దండే పాల్



టీచ్ టూల్ శిక్షణా కార్యక్రమంలో మాట్లాడుతున్న టీచ్ టూల్ రాష్ట్ర పరిశీలకులు దండే పాల్

కడప ఎడ్యుకేషన్ : మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా ఉపాధ్యాయులు ఎప్పటికప్పుడు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల నుంచి అందించే శిక్షణ ద్వారా బోధనాభ్యసన సామర్థ్యాలను పెంపొందించుకోవాలని ఎస్‌సీఈఆర్‌టీ ప్రతినిధి, టీచ్ టూల్ రాష్ట్ర పరిశీలకులు దండేపాల్ సూచించారు. సోమవారం కడప నగరపాలక ఉన్నత పాఠశాలలో సమగ్ర శిక్ష అల్టర్నేటివ్ స్కూల్ జిల్లా కోఆర్డినేటర్, కోర్సు డైరెక్టర్ చల్లా విశ్వనాథరెడ్డి ఆధ్వర్యంలో జరుగుతున్న టీచ్ టూల్ శిక్షణ కార్యక్రమాన్ని రాష్ట్ర పరిశీలకులు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మారుతున్న కాలానికి అనుగుణంగా బోధన అభ్యసన ప్రక్రియలో మార్పులను ఉపాధ్యాయులకు అందించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనేక శిక్షణా కార్యక్రమాలు నిర్వహిస్తున్నాయన్నారు. అందులో భాగమే టీచ్ టూల్ కూడా అన్నారు. తొమ్మిది రోజులపాటు జరిగే ఈ శిక్షణను ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, సీఆర్పీలు సద్వినియోగం చేసుకొని తరగతి గదిలో విద్యార్థులకు వీటిని అమలు చేయడం ద్వారా ప్రభుత్వాలు ఆశించిన మేర విద్యార్థుల నుండి ఫలితాలను పొందవచ్చు అని పేర్కొన్నారు. కడప డిప్యూటీ ఈఓ రాజగోపాల్ రెడ్డి మాట్లాడుతూ ఉపాధ్యాయులు పొందిన శిక్షణతో ఆ తరువాత విద్యార్థులతో మమేకమై వారికి బోధించి మంచి ఫలితాలు సాధించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఎంఓ రామాంజనేయులు రెడ్డి, టీచ్ టూల్ జిల్లా అబ్జర్వర్ సాయిరాం, రిసోర్స్ పర్సన్‌లు గాయత్రి బాయ్, ఉమామహేశ్వరి, నాగమణి, కుమారి, రాజేశ్వరి, మునీంద్రమ్మ తదితరులు పాల్గొన్నారు.

నవోదయలో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

రాజంపేట : జవహర్ నవోదయ విద్యాలయం(నారమరాజుపల్లె, రాజంపేట)లో 2025–26 విద్యా సంవత్సరానికి 6వ తరగతిలో ప్రవేశానికి దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ గీత ఒక ప్రకటనలో తెలిపారు. ఐదో తరగతి చదువుతున్న విద్యార్థులు సెప్టెంబర్ 16వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఉమ్మడి వైఎస్సార్ జిల్లాలోని విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. పూర్తి వివరాలకు డబ్ల్యుడబ్ల్యుడబ్ల్యు.ఎన్‌వీఓడీఏవైఏ.జీఓవీ.ఇన్, హెచ్‌టీటీపీఎస్://ఎన్‌వీఓడీఏవైఏ.జీఓవీ.ఇన్ వెబ్‌సైట్‌లను సంప్రదించాలన్నారు.

ఉత్సాహంగా సాగుతున్న స్కౌట్స్ శిక్షణ శిబిరం

కడప స్పోర్ట్స్ : కడప నగరం శంకరాపురంలోని భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ ప్రాంతీయ శిక్షణా కేంద్రంలో నిర్వహిస్తున్న బేసిక్ శిక్షణ శిబిరం ఉత్సాహంగా సాగుతోంది. శిక్షణలో భాగంగా సోమవారం కబ్, స్కౌట్, రోవర్ మాస్టర్లకు టెంట్ ఏర్పాటు, అత్యవసర సమయాల్లో వ్యవహరించే తీరు, స్పందించే విధానాలపై శిక్షణ ఇచ్చారు. శిక్షణలో ప్రతిరోజూ వ్యాయామాలు చేయిస్తున్నట్లు స్కౌట్స్ అండ్ గైడ్స్ కార్యదర్శి ప్రమీల తెలిపారు.

వైభవంగా సౌమ్యనాథ స్వామి చక్రస్నానం



కోనేటిలో చక్రస్నానం నిర్వహిస్తున్న అర్చకులు

నందలూరు : జిల్లాలో చరిత్రాత్మక, వైష్ణవ దేవాలయం నందలూరులోని శ్రీ సౌమ్యనాథస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ సౌమ్యనాథస్వామి ఉత్సవ మూర్తులకు చక్రస్నాన కార్యక్రమాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఆలయ అర్చకులు సునీల్ కుమార్ శర్మ బృందం ఆధ్వర్యంలో మంత్రోచ్చరణల నడుమ ఈ కార్యక్రమం జరిగింది. ఉదయం శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ సౌమ్యనాథస్వామిని పల్లకిలో మాఢవీధుల గుండా ఊరేగించారు. అత్యంత భక్తి శ్రద్ధలతో పంచామృతాభిషేకం నిర్వహించారు. అనంతరం చక్రతల్వార్‌ను కోనేటిలో చక్ర స్నానం ఆచరించారు. రాత్రి 7 గంటలకు ధ్వజారోహణం, మహాపూర్ణాహుతి కార్యక్రమాలను నిర్వహించారు.

బ్రహ్మోత్సవాల్లో నేడు: బ్రహ్మోత్సవాల్లో భాగంగా చివరి రోజు మంగళవారం సాయంత్రం 6 గంటలకు పుష్పయాగం నిర్వహించనున్నట్లు ఆలయ ఇన్‌స్పెక్టర్ దిలీప్ కుమార్ తెలిపారు.

కనుల పండువగా శివకేశవుల కల్యాణం



శివకేశవుల కల్యాణం నిర్వహిస్తున్న వేదపండితులు



కల్యాణం తిలకిస్తున్న భక్తులు

రాజంపేట : అన్నమాచార్యుల జన్మ స్థలమైన తాళ్లపాకలో జరుగుతున్న వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం సాయంత్రం శివకేశవుల కల్యాణం కనుల పండువగా జరిగింది. తిరుమల–తిరుపతి దేవస్థానముల వేదపండితులు కామాక్షి సమేత సిద్దేశ్వరస్వామికి, శ్రీదేవి భూదేవి సమేత చెన్నకేశవ స్వామికి కల్యాణం నిర్వహించారు. శివకేశవులు ఇరువురికి ఒకే వేదికపై కల్యాణోత్సవం జరగడం తాళ్లపాకలోని ప్రత్యేకత. కల్యాణం అనంతరం సిద్దేశ్వరస్వామి చెన్నకేశవ స్వాములు గజవాహనంపై మాఢవీధులలో ఊరేగుతూ భక్తులకు కనువిందు చేశారు. ప్రొద్దుటూరుకు చెందిన విజయలక్ష్మి, రాజరాజేశ్వరి, నందలూరు నాగిరెడ్డిపల్లికి చెందిన భారతీయ బృందాలు తమ కోలాటాలతో భక్తులను అలరించారు. ఒంటిమిట్ట దేవాలయాల సమూహ పర్యవేక్షణ అధికారి వై.హనుమంతయ్య ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఆలయ ఇన్‌స్పెక్టర్ బాలాజీ, గురుస్వామి యాదవ్, వినోద్ కుమార్, టీటీడీ విజిలెన్స్ ఇన్‌స్పెక్టర్ నాగ సుబ్బారెడ్డి, సెక్యూరిటీగార్డు శేషాచలం, ఇన్‌చార్జి గంగులయ్య, హిందూ ధర్మప్రచార పరిషత్ జిల్లా ప్రోగ్రామ్ అసిస్టెంట్ గోపి బాబు, ఆర్.స్వామి నాయక్, ధర్మాచార్యులు గంగనపల్లి వెంకటరమణ, భక్తులు పాల్గొన్నారు.

దివ్యాంగులు ప్రత్యేక పరికరాలను సద్వినియోగం చేసుకోవాలి

– డీఆర్‌ఓ సత్యనారాయణ

రాయచోటి (జగదాంబసెంటర్) : విభిన్న ప్రతిభావంతులు(దివ్యాంగులు) ప్రత్యేక పరికరాలను సద్వినియోగం చేసుకోవాలని డీఆర్‌ఓ సత్యనారాయణ అన్నారు. అన్నమయ్య జిల్లా కలెక్టర్ కార్యాలయంలో విభిన్న ప్రతిభావంతులకు పరికరాలను అసిస్టెంట్ డైరెక్టర్ కృష్ణకిషోర్ ఆధ్వర్యంలో సోమవారం పంపిణీ చేశారు. ముఖ్య అతిథిగా హాజరైన డీఆర్‌ఓ మాట్లాడుతూ ఇంకా ఎవరికైనా కృత్రిమ, మూగ, చెవిటి పరికరాలు కావాలన్నా ఏడీ కార్యాలయంలో సంప్రదించాలని కోరారు. సూపరింటెండెంట్ అనిల్‌కపూర్, విభిన్న ప్రతిభావంతుల రాష్ట్ర అధ్యక్షుడు గాదె శ్రీను, జిల్లా ప్రధాన కార్యదర్శి శివకుమార్ పాల్గొన్నారు.



ప్రత్యేక పరికరాలను అందజేస్తున్న డీఆర్‌ఓ

క్లుప్తంగా

పెన్నా నదిలో సర్వే



సర్వే చేస్తున్న మైన్స్, రెవెన్యూ అధికారులు

సిద్దవటం : మండల పరిధి జ్యోతి గ్రామ సమీపంలోని పెన్నానదిలో మంగళవారం మైన్స్, రెవెన్యూ అధికారులు సర్వే నిర్వహించారు. జ్యోతి పెన్నానది పరిసర ప్రాంతాల్లో, శివాలయం వద్ద నాణ్యమైన ఇసుక కోసం సర్వే చేస్తున్నారు. ఇక్కడి ఇసుక నాసిరకంగా ఉంటోందని వినియోగదారులు వాపోతున్నారు. కూటమి ప్రభుత్వం ఉచిత ఇసుక రవాణా అంటూ ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఇక్కడి ఇసుకను తీసుకెళ్లడానికి వినియోగదారులు ఆసక్తి చూపడం లేదు. ఈ నేపథ్యంలో ఇక్కడ నాణ్యమైన ఇసుక కోసం మైన్స్, రెవెన్యూ అధికారులు సర్వే చేస్తున్నారు.

వ్యక్తి ఆత్మహత్య



మృతి చెందిన శ్రీనివాసులు

రామసముద్రం : రామసముద్రం మండలం ఎలవానెల్లూరు పంచాయతీ ఏ.కొత్తూరుకు చెందిన జిల్లా శ్రీనివాసులు(50) సోమవారం పురుగుల నివారణ మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్ఐ చంద్రశేఖర్ కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. శ్రీనివాసులు తాగుడుకు అలవాటు పడి డబ్బులు వృథా చేస్తుండే వాడు. ఈ విషయమై శ్రీనివాసులు, ఆయన భార్య మంజులమ్మ గొడవ పడ్డారు. ఈ క్రమంలో ఉదయం పొలం వద్దకు పశువులను మేపేందుకు వెళ్లి పురుగుల నివారణ మందు తాగాడు. భార్య వెళ్లి చూడగా అపస్మారక స్థితిలో ఉన్నాడు. వెంటనే అతన్ని రామసముద్రం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడి వైద్యులు ప్రాథమిక చికిత్స చేసి మెరుగైన వైద్యం కోసం పుంగనూరుకు తీసుకెళ్లాలని సూచించారు. అక్కడికి తీసుకెళ్తుండగా మార్గం మధ్యలోనే మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టానికి తరలించి, హెడ్‌కానిస్టేబుల్ కిరణ్ కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

హత్య కేసులో నిందితుడి అరెస్ట్

కడప అర్బన్ : కడప నగరం తాలూకా పోలీస్ స్టేషన్ పరిధిలో ఈనెల 19వ తేదీన రాత్రి బిల్టప్ సమీపంలో పుత్తా ఎస్టేట్స్‌లోని ఖాళీ స్థలంలో చింపిరి వెంకటేష్ (32)ను కడప రవీంద్రనగర్‌కు చెందిన సాదిక్‌వలీ హత్య చేసిన విషయం తెలిసిందే. ఈ సంఘటనలో నిందితుడు సాదిక్‌వలీని కడప తాలూకా సీఐ తిమ్మయ్య, ఎస్ఐ మల్లికార్జున తమ సిబ్బందితో కలిసి సోమవారం అతని ఇంటి వద్ద అరెస్ట్ చేశారు.

కొత్త బంగారు లోకం

● స్వాగతం పలుకుతున్న చదువుల ఒడి ● ట్రిపుల్ ఐటీలో ప్రారంభమైన అడ్మిషన్ల ప్రక్రియ



అడ్మిషన్లు పొందేందుకు వచ్చిన విద్యార్థిని, విద్యార్థులు

వేంపల్లె : రాజీవ్ గాంధీ వైజ్ఞానిక సాంకేతిక విశ్వవిద్యాయలం పరిధిలోని ఇడుపులపాయ ఆర్కేవ్యాలీ ట్రిపుల్ ఐటీలో సోమవారం కొత్తగా ఎంపికైన విద్యార్థిని, విద్యార్థులకు అడ్మిషన్ల ప్రక్రియ నిర్వహించారు. డైరెక్టర్ ఏవీఎస్ కుమారస్వామి గుప్తా, డీన్ అకాడమిక్, క్యాంపస్ కౌన్సెలింగ్ కన్వీనర్ డాక్టర్ సీహెచ్ రత్నకుమారీలు అడ్మిషన్ల ప్రక్రియ ప్రారంభించారు.

అడ్మిషన్ల ప్రక్రియ ఇలా..

ఇడుపులపాయ ట్రిపుల్ ఐటీలో 2024–25 విద్యా సంవత్సరానికి సంబంధించి సోమవారం విద్యార్థులకు అడ్మిషన్ల ప్రక్రియ ప్రారంభమైంది. ఉదయం 6 గంటలకే ఇడుపులపాయ ఆర్కేవ్యాలీ ట్రిపుల్ ఐటీ ఎంట్రన్స్ భాగంలో ఉన్న రాజీవ్ సర్కిల్ వద్ద ముందుగా వచ్చిన విద్యార్థులకు టోకన్లను అందజేశారు. వివిధ దశలలో స్క్రీనింగ్ చేయడానికి ఎనిమిది ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేశారు. ఎవరికీ ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా అన్ని చర్యలు తీసుకున్నారు. అడ్మిషన్లు పొందేందుకు వచ్చిన విద్యార్థులు, వారి తల్లిదండ్రులకు ఎటువంటి ఇబ్బందులు జరగకుండా చలువ పందిళ్లు ఏర్పాటు చేశారు.

■ టోకన్లు తీసుకున్న విద్యార్థులకు ఇడుపులపాయ క్యాంపస్‌లోని సెంట్రల్ లైబ్రరీ గ్రౌండ్ ఫ్లోర్‌లో ఫైల్ డిస్ట్రిబ్యూషన్ నిర్వహించారు. ఆ తర్వాత ఫస్ట్ ఫ్లోర్‌లో క్యాస్ట్ వెరిఫికేషన్, ఫీజు పేమెంట్, ఐడీ కార్డుల డిస్ట్రిబ్యూషన్, బయోమెట్రిక్ అటెండెన్స్, చివరగా ఫైల్ సబ్మిట్‌తో విద్యార్థి కౌన్సెలింగ్ ప్రక్రియ పూర్తి చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వేంపల్లి నుంచి ఇడుపులపాయకు ప్రతి గంటకు ప్రత్యేక బస్సులను నడిపారు.

■ మొదటి రోజున 515 మందికి అడ్మిషన్లు ఇవ్వాల్సి ఉండగా 427 మంది హాజరై అడ్మిషన్లను పొందారు. అడ్మిషన్ పొందిన విద్యార్థులతోపాటు తల్లిదండ్రులకు భోజన సదుపాయం, టెంటులు, కుర్చీలు ఏర్పాటు చేశారు. ఈ అడ్మిషన్ల ప్రక్రియను ట్రిపుల్ ఐటీ పరిపాలన అధికారి రవికుమార్, అసిస్టెంట్ ప్రొఫెసర్ రోజర్ బిన్నీ, అధికారులు చంద్రారెడ్డి, రాఘవరెడ్డి, కోటేశ్వరి, ఇమ్రాన్, తిరుపతిరెడ్డి, లింగమూర్తి, జ్ఞానవెంకట్ తదితరులు దగ్గరుండి నిర్వహించారు.

■ మంగళవారం రోజు మరో 500 మంది విద్యార్థులకు ఇడుపులపాయ ట్రిపుల్ ఐటీకి సంబంధించి కౌన్సెలింగ్ నిర్వహించనున్నారు. జూలై 24, 25వ తేదీల్లో ఇడుపులపాయ క్యాంపస్‌లోనే ఒంగోలు ట్రిపుల్‌ఐటీకి సంబంధించి రెండు రోజులపాటు కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు డైరెక్టర్ తెలిపారు.

వైఎస్సార్‌ను స్మరించుకున్న విద్యార్థులు

రాయలసీమ జిల్లాలతోపాటు నెల్లూరు జిల్లా నుంచి అడ్మిషన్లు పొందేందుకు విద్యార్థులు వచ్చారు. ఈ నేపథ్యంలో దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డిని వారు స్మరించుకున్నారు. ఆయన ఈ ట్రిపుల్ ఐటీలను స్థాపించడం వల్లే మాలాంటి పేద విద్యార్థులకు ఇలాంటి అవకాశం వచ్చిందని అన్నారు. ఆయనను ఎన్నటికీ మరువలేమన్నారు. కష్టపడి బాగా చదివి తల్లిదండ్రులకు, ట్రిపుల్ ఐటీకి గొప్ప పేరు తీసుకువస్తామని వారు పేర్కొన్నారు.

ఇంజినీర్లుగా సేవ చేస్తాం

ట్రిపుల్ ఐటీలో చదివి భావిభారత ఇంజినీర్లుగా దేశానికి సేవ చేయాలన్నదే లక్ష్యంగా చదువులో రాణించి ముందుకు సాగుతామని అడ్మిషన్లు పొందిన విద్యార్థులు తెలిపారు. ఎక్కువగా రైతు కూలీల బిడ్డలే ట్రిపుల్ ఐటీకి ఎంపికైన వారిలో ఉన్నారు. తల్లిదండ్రుల ఆశలను నెరవేర్చే దిశగా విద్యార్థులు సిద్ధమవుతున్నారు.

కూలీ పనులు చేసుకుంటూ చదివించారు



మా తండ్రి చంద్రశేఖర్, తల్లి సుజాత కూలీ పనులు చేసుకుంటూ నన్ను చదివించారు. శ్రీ సత్యసాయి జిల్లా గోరంట్ల జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి చదివి 573 మార్కులు సాధించాను. నేను గ్రూప్స్‌నకు ప్రిపేర్ అయ్యి ఐఏఎస్ అవుతాను. ట్రిపుల్‌ఐటీలో ఎక్కువ మార్కులు సాధించేందుకు కృషి చేస్తాను.

- ఎ.కుసుమ, గోరంట్ల, శ్రీ సత్యసాయి జిల్లా

ట్రిపుల్‌ఐటీ సీటు కోసం కష్టపడి చదివాను



ట్రిపుల్‌ఐటీ సీటు కోసం కష్టపడి చదివాను. వ్యవసాయ కుటుంబంలో ఉంటూ తల్లిదండ్రులు శ్రీనివాసులు, ఎల్లమ్మలు నన్ను ఎంతో ప్రోత్సహించారు. వారి ఆశయాలను వమ్ము చేయకుండా ట్రిపుల్‌ఐటీలో కూడా కష్టపడి చదివి అద్భుత ఫలితాలను సాధిస్తాను. డా.బి.ఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో 10వ తరగతి చదివి 571 మార్కులు సాధించాను. ట్రిపుల్ ఐటీలో కష్టపడి చదివి సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ అవుతా.

- జి.కార్తీక్, కుప్పం, చిత్తూరు జిల్లా

సివిల్ ఇంజినీర్ కావాలన్నదే లక్ష్యం



ట్రిపుల్ ఐటీలో రాణించి సివిల్ ఇంజినీర్ కావాలన్నదే నా లక్ష్యం. మాది వైఎస్సార్ కడప జిల్లా జమ్మలమడుగు మండలం కొత్తగుంట పల్లి. తల్లిదండ్రులు రాజునాయక్, కులాయమ్మలు కూలి పని చేసుకుంటూ నన్ను చదివించారు. వైఎస్సార్ కడప జిల్లాలోని పులివెందులలో ఆంధ్రప్రదేశ్ ట్రైబల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూల్లో 10వ తరగతి చదివి 560 మార్కులు సాధించాను.

- బి.విష్ణునాయక్, కొత్తగుంటపల్లి, వైఎస్సార్ కడప జిల్లా

క్రమశిక్షణతో విద్యను అభ్యసిస్తా



ట్రిపుల్‌ఐటీలో వచ్చిన అవకాశాన్ని వదులుకోకుండా క్రమశిక్షణతో విద్యను అభ్యసించి ఉత్తమ ప్రతిభను కనబరుస్తాను. మా పాఠశాలలో కష్టపడి చదివి ఫస్ట్‌లో రాణించాను. ట్రిపు ఐటీలో కూడా ఉత్తమ ఫలితాలను సాధిస్తా. తల్లిదండ్రులు రామరాజు, రామలక్ష్మమ్మలు వ్యవసాయం చేసుకుంటూ నన్ను చదివించారు. నంద్యాల జిల్లా కోవెలకుంట గ్రామంలో ఉన్న డా.బి.ఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో 10వ తరగతి చదివి 570 మార్కులు సాధించాను.

- డి.రాధిక, బనగానపల్లి, కర్నూలు జిల్లా

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల హామీల అమలు కోసం పోరు



మాట్లాడుతున్న సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు ఈశ్వరయ్య

రాయచోటి అర్బన్ : కేంద్ర, రాష్ట ప్రభుత్వాలు ఇచ్చిన హామీల అమలుకు సీపీఐ శ్రేణులు నిరంతరం పోరాటం చేయాలని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గసభ్యుడు గుజ్జుల ఈశ్వరయ్య అన్నారు. సోమవారం స్థానిక ఎన్‌జీఓ హోంలో నిర్వహించిన సీపీఐ జిల్లా కార్యవర్గ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సీఎం చంద్రబాబు శ్వేతపత్రాల విడుదలతోనే కాలయాపన చేస్తున్నారన్నారు.

రాష్ట్రంలో నెలకొన్న అశాంతిని తొలగించేందుకు ఎటువంటి ప్రయత్నాలు చేయడం లేదని పేర్కొన్నారు. మహిళలపై జరుగుతున్న అఘాయిత్యాలు అరికట్టడంలో డబుల్ ఇంజిన్ సర్కార్ వైఫల్యం చెందుతోందన్నారు. సమస్యలు పరిష్కరించే అంశంలో సీపీఐ కార్యకర్తలు ఆయా వర్గాల ప్రజలతో మమేకమవుతూ పోరాటం దిశగా ముందుకు సాగాలన్నారు. ఈ నెల 29 నుంచి 31 వరకు మదనపల్లెలో ఏపీ రైతుసంఘం రాష్ట్ర సమ్మేళనాలను నిర్వహిస్తున్నామన్నారు. ఆగస్టు 20 నుంచి 22 వరకు పార్టీ నియోజకవర్గ మండల నేతలకు జిల్లాలోని రైల్వేకోడూరులో జిల్లా స్థాయి వర్క్‌షాపు నిర్వహిస్తామన్నారు. శారీరక దృఢత్వం, మానసిక ధైర్యంతోపాటు మతోన్మాదశక్తులు, రౌడీమూకల నుంచి ఉద్యమాలను కాపాడుకోవడానికి నవంబరులో సుండుపల్లె మండలంలో శిక్షణ కార్యక్రమాన్ని ఏర్పాటు చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో సీపీఐ రాష్ట్రకార్యవర్గ సభ్యుడు శివారెడ్డి, అన్నమయ్య జిల్లా కార్యదర్శి పి.యల్.నరసింహులు, సహాయ కార్యదర్శి మహేష్, జిల్లా కార్యవర్గ సభ్యులు విశ్వనాథనాయక్, కోటేశ్వరరావు, కృష్ణప్ప, సిద్దిగాళ్ళ శ్రీనివాసులు, సాంబశివ, మండెం సుదీర్‌కుమార్, మనోహర్‌రెడ్డి, సుమిత్రమ్మ, మురళి, వెంకటేష్, జ్యోతి, చిన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

నిరుపేద.. ఆపై పెద్ద బాధ

అతను నిరుపేద. ఆ పేదింటికి పెద్ద దిక్కు. చిన్న పని చేసుకుంటూ ఉన్నంతలో జీవనం సాగించే వాడు. ఈ నేపథ్యంలో అనారోగ్యం పంజా విసిరింది. దీంతో అతను నిర్జీవంగా మారాడు. ఇంటి యజమాని మంచానపడడంతో ఆ కుటుంబంలో స్తబ్ధత నెలకొంది. ఆపన్న హస్తం కోసం ఆ కుటుంబం ఎదురు చూస్తోంది.

- గుండె, ఊపిరితిత్తులకు మధ్యలో గడ్డ
- కిడ్నీతోపాటు శరీరంపై పెను ప్రభావం
- సర్జరీ చేయాలని వైద్యుల సూచన
- దాతల సాయం కోసం ఎదురుచూపు

కడప రూరల్ : కడప నగరం ప్రకాష్ నగర్‌లో వెంకటరమణ, సరిత దంపతులు నివసిస్తున్నారు. అద్దె ఇంటిలో నంబర్: 8/86 (మిద్దెపైన) ఉంటున్నారు. వీరికి పదకొండేళ్ల సంప్రీత్ అనే కుమారుడు ఉన్నాడు. ఈ బాలుడు స్థానిక గాంధీనగర్ మున్సిపల్ హైస్కూల్‌లో 6వ తరగతి చదువుతున్నాడు. వీరిది నిరుపేద కుటుంబం.

ఆ ఇంటి విషాదం నింపిన అనారోగ్యం

వెంకటరమణ స్థానిక వస్త్ర దుకాణంలో సేల్స్‌మ్యాన్‌గా పని చేసే వాడు. ఆ వచ్చే డబ్బులతో ఇంటిని నెట్టుకొచ్చే వాడు. 'ఉన్నంతలో జీవనం సాఫీగా సాగిపోతోంది' అని అనుకొనే తరుణంలో ఆ పేదింట అనారోగ్యం కాటు వేసింది. ఒక రోజు వెంకటరమణకు ఉన్నఫళంగా రక్తపు విరేచనాలు, వాంతులు అయ్యాయి. దీంతో ఆయనతోపాటు భార్య సరిత ఆందోళనకు గురయ్యారు. కొందరి సూచనల మేరకు హైదరాబాద్‌లోని కిమ్స్ ఆసుపత్రికి వెళ్లారు. అక్కడి వైద్యులు వెంకటరమణను పరీక్షించారు. కొన్ని వైద్య పరీక్షలు నిర్వహించారు. గుండెకు, ఊపిరితిత్తులకు మధ్యలో ఒక గడ్డను గుర్తించారు. ఆ ప్రభావం కిడ్నీతోపాటు శరీరంపై పెను ప్రభావం చూపిస్తోందని నిర్ధారించారు. తక్షణం గడ్డను తొలగించడానికి సర్జరీ చేయాలని వైద్యులు సూచించారు. అందుకోసం రూ.3 లక్షలకు పైగా ఖర్చు అవుతుంది. ఈ వైద్య ఖర్చుల కోసం ఇప్పటికే ఆ కుటుంబం దాదాపు రూ.50 వేలకు పైగా అప్పు చేసింది. పూట గడవడమే గగనంగా మారిన ఆ కుటుంబానికి రూ.3 లక్షలకు పైగా డబ్బును సమకూర్చుకోవడం అనితర సాధ్యంగా మారింది.

దాతలు దయ చూపితే..

వైద్యులు మరో మూడు రోజుల్లో (గురువారం లోపు) వెంకటరమణకు సర్జరీ చేయాలని సూచించారు. లేదంటే ఆరోగ్యం విషమించే ప్రమాదం ఉందని ఆ కుటుంబం ఆందోళన చెందుతోంది. వెంకటరమణ భార్య సరిత తన భర్త ఆరోగ్యం కోసం మొక్కని దేవుడంటూ లేడు. దాతలు సహకరిస్తే ఆ ఇంట సంతోషాల జీవన జ్యోతి వెలుగుతుంది. వెంకటరమణ ఫోన్ నంబరు: 6303718083, బ్యాంకు ఖాతా నెంబరు 50100631917829, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు, ఎర్రముక్కపల్లె, కడప.



అనారోగ్యంతో మంచానికే పరిమితమైన వెంకటరమణ

నా భర్తను బతికించండి



నా భర్త అనారోగ్యంతో బాధపడతున్నాడు. ఆయనే మా జీవనాధారం. ఆయనకు ఆరోగ్యం బాగలేక మంచాన పడ్డారు. డాక్టర్లు సర్జరీ చేయాలన్నారు. అందుకోసం రూ.3 లక్షలకు పైగా ఖర్చు అవుతుంది. ఆరోగ్య శ్రీలో ఈ జబ్బుకు చికిత్స లేదని వైద్యులు తెలిపారు. దాతలు దయ చూపి నా భర్తను బతికించాలి.

- సరిత, వెంకటరమణ భార్య

ఎర్రచందనం దుంగల స్వాధీనం



టాస్క్‌ఫోర్స్ అధికారుల అదుపులో ఎర్రచందనం దుంగలు, నిందితులు

సుండుపల్లె : కావలిపల్లి రాయవరం సెక్షన్ వద్ద మామిడితోటలో ఏడు ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకోవడంతోపాటు ముగ్గురు స్మగ్లర్లను టాస్క్‌ఫోర్స్ పోలీసులు అరెస్టు చేసి వారి నుంచి రెండు మోటారు సైకిళ్లను స్వాధీనం చేసుకున్నారు. టాస్క్‌ఫోర్స్ ఇన్‌చార్జి, తిరుపతి జిల్లా ఎస్పీ ఎల్.సుబ్బరాయుడు ఆదేశాలతో టాస్క్‌ఫోర్స్ ఎస్పీ పి.శ్రీనివాస్ ఆధ్వర్యంలో డీఎస్పీ చెంచుబాబు సూచనల మేరకు ఆర్ఐ సురేష్‌కుమార్‌రెడ్డికి చెందిన, ఆర్ఎస్ఐ కె.సురేష్ బాబుకు చెందిన టీమ్ ఆదివారం రాత్రి నుంచి అన్నమయ్య జిల్లా రాజంపేట సమీపంలోని సానిపాయి రేంజ్ రాయవరం నుంచి ఎంట్రీ ఎగ్జిట్ పాయింట్లను తనిఖీ చేసుకుంటూ వెళ్లారు.

సోమవారం తెల్లవారుజామున రెడ్డివారిపల్లె–మాచిరెడ్డిగారిపల్లి రోడ్డుకు తూర్పు వైపున ఉన్న మామిడితోట వద్దకు చేరుకున్నారు. అక్కడ మూడు మోటారు సైకిళ్లపై కొందరు వ్యక్తులు కూర్చొని ఉన్నారు. వారిని చుట్టుముట్టగా ఒక వ్యక్తి ఒక మోటారు సైకిల్‌లో పారిపోయాడు. మిగిలిన ముగ్గురిని పట్టుకొని విచారణ చేసి సమీపంలో ఎర్రచందనం దుంగల డంప్‌ను కనుగొన్నారు. అక్కడ ఏడు ఎర్రచందనం దుంగలు కనిపించగా వాటిని స్వాధీనం చేసుకున్నారు. అన్నమయ్య జిల్లా జిల్లేళ్ల మంద పంచాయతీకి చెందిన జి.సురేష్ (34), జి.అశోక్ (28), మాచిరెడ్డిపల్లికి చెందిన పందిపాటి తిరుమలయ్యను అరెస్టు చేశారు. వారిపై తిరుపతి టాస్క్‌ఫోర్స్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేశారు. సీఐ శ్రీనివాసులు దర్యాప్తు చేస్తున్నారు. ఈ ఆపరేషన్‌లో అటవీశాఖకు చెందిన వారు కూడా పాల్గొన్నారు.

ముగ్గురు రెవెన్యూ అధికారుల సస్పెన్షన్

కడప సెవెన్‌రోడ్స్ : చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడిన ముగ్గురు రెవెన్యూ అధికారులను సస్పెండ్ చేసినట్లు కలెక్టర్ శివశంకర్ సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. బద్వేలు రెవెన్యూ డివిజన్ బి.కోడూరు మండలం మున్నెల్లి గ్రామంలో 4.27 ఎకరాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన స్థలాన్ని డిప్యూటీ తహసీల్దార్ (ఎఫ్ఏసీ) జి.విద్యాసాగర్, గ్రామ సర్వేయర్ ఎ.ప్రవీణ్‌కుమార్, వీఆర్వో జె.గురవయ్య కలిసి రికార్డులను పరిశీలించకుండా, ప్రాథమిక విచారణ చేయకుండా నిబంధనలకు విరుద్ధంగా కొండా వెంకట సుబ్బమ్మకు మ్యూటేషన్ చేశారని పేర్కొన్నారు. దీంతో ఈ ఏడాది ఫిబ్రవరి 14వ తేదీన కొండా వెంకట సుబ్బమ్మ ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘంలో ఆ భూమిని మార్టిగేజ్ చేసి రూ.8 లక్షల రుణం తీసుకున్నదని పేర్కొన్నారు. ఈ మొత్తం వ్యవహారంపై బద్వేలు ఇన్‌చార్జి ఆర్డీఓ చంద్రమోహన్‌ను విచారణ అధికారిగా నియమించి నివేదిక తెప్పించుకున్నామన్నారు. ఆ నివేదిక మేరకు ముగ్గురు రెవెన్యూ అధికారులను సస్పెండ్ చేశామని వివరించారు. అంతేకాకుండా వీరిపై క్రమశిక్షణా చర్యల్లో భాగంగా ఛార్జెస్ కూడా ఫ్రేం చేశామని పేర్కొన్నారు. ఆర్డీఓ, తహసీల్దార్ల కార్యాలయాల వద్ద తప్పనిసరిగా నైట్ వాచ్‌మెన్‌లను ఏర్పాటు చేసుకోవాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ఆదేశించారు.

భూ తగాదాలో భార్యాభర్తలకు జైలు

ములకలచెరువు : ఆరేళ్ల క్రితం జరిగిన భూ తగాదా కేసులో భార్య, భర్తలకు మూడేళ్ల జైలు శిక్షను విధిస్తూ మదనపల్లి న్యాయమూర్తి సోమవారం తీర్పు ఇచ్చారు. వివరాల్లోకి వెళితే.. మండలంలోని పెద్దపాళ్యం పంచాయతీ మలిగివారిపల్లికి చెందిన ముత్తన వేమనారాయణ, శంకరమ్మ దంపతులకు ఒక కుమారుడు, ముగ్గురు కుమార్తెలు సంతానం. అయితే పూర్వీకుల నుంచి సంక్రమించిన 4.79 ఎకరాల భూమిని శంకరమ్మ కుంటుబీకులు దున్నేందుకు ఉపక్రమించారు. ఈ సమయంలో సదరు భూమిలో తమకు హక్కు ఉందని పేర్కొంటూ వీరి దాయాది అయిన నెటవరాయునిపల్లికి చెందిన దంపతులు జయరాం, రత్నమ్మలు అడ్డుకుని తమపై కారం పొడి చల్లి కొడవళ్లతో హత్యాయత్నానికి పాల్పడి భయభ్రాంతులకు గురి చేశారంటూ 2018 జూన్ 16న శంకరమ్మ ఫిర్యాదు చేసింది. అప్పటి నుంచి సదరు కేసు కోర్టులో నడుస్తోంది. ఈ నేపథ్యంలో సోమవారం జరిగిన కేసు తుది విచారణలో భార్య, భర్తలైన జయరాం (52), రత్నమ్మ (48)లకు మూడేళ్ల జైలు శిక్షతోపాటు రూ.1500 జరిమానా విధిస్తూ మదనపల్లి న్యాయమూర్తి తీర్పు ఇచ్చారని ఎస్ఐ తిప్పేస్వామి వెల్లడించారు.

ఇలా ఉంటే తాగేదెలా స్వామీ..!



పంచలింగాల వద్ద కోనేరులో పాచిపట్టిన నీరు

సిద్దవటం : మండలంలోని వంతాటిపల్లె గ్రామ సమీపంలో ఉన్న లంకమల అభయారణ్యంలో వెలసిన శ్రీ నిత్యపూజ స్వామి భక్తులు తాగునీటి ఇబ్బందులు ఎదుర్కొని ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమవారం భక్తులు స్వామి వారిని దర్శించుకునేందుకు జిల్లా నలమూల నుంచి వచ్చి పూజలు చేశారు. పంచలింగాల వద్ద ఉన్న తాగునీటి కోనేరు పాచిపట్టి అధ్వానంగా ఉండి నీరు దుర్వాసన వస్తోందని, కొండ దిగివచ్చి దాహంతో ఈ నీరు ఎలా తాగాలని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు కోనేరులోని నీటిని తోడేసి బ్లీచింగ్‌చల్లి క్లోరినేషన్ చేయాలని భక్తులు తెలియజేశారు. లేదంటే దప్పికకు తట్టుకోలేక ఈ నీరు తాగితే విష జ్వరాలు, డయేరియా వచ్చే అవకాశం ఉందని వారు అధికారులను హెచ్చరించారు.

ముద్దనూరు మండలంలో సంచార జూదం

టాస్క్‌ఫోర్స్ : ముద్దనూరు మండలంలో గత 4 రోజులుగా సంచార జూదం నిర్వహిస్తున్నట్లు తీవ్ర ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. మండల పరిధిలోని వేల్పుచెర్ల, దేనేపల్లె, కాన పరిసర ప్రాంతాల్లో మంగతాయి జూదం నిర్వహిస్తున్నట్లు సమాచారం. ఇందులో రోజుకు కనీసం రూ.50 లక్షల వరకు చేతులు మారుతున్నట్లు తెలుస్తోంది. పోలీసు ఉన్నతాధికారులు స్పందించి ఈ మొబైల్ జూదాన్ని అరికట్టాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

మహిళపై అత్యాచారయత్నం.. కేసు నమోదు

చాపాడు : అన్నవరం పంచాయతీ చెండ్లూరుకు చెందిన పట్నం దస్తగిరమ్మ(26)పై అదే గ్రామానికి చెందిన బయపురెడ్డి శ్రీనివాసులురెడ్డి సోమవారం అత్యాచారయత్నానికి పాల్పడినట్లు కేసు నమోదు చేశామని ఎస్ఐ ఆర్‌వీ కొండారెడ్డి పేర్కొన్నారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు వివరాలు ఇలా ఉన్నాయని ఎస్ఐ తెలిపారు. శ్రీనివాసులరెడ్డి గత కొన్ని రోజులుగా దస్తగిరమ్మను లోబర్చుకునేందుకు సైగలు చేస్తుండటం, ఆమె వెంట పడటం వంటివి చేస్తూ లైంగిక వేధింపులకు పాల్పడినట్లు పేర్కొన్నారు. ఇదే క్రమంలో సోమవారం ఉదయం 10 గంటల ప్రాంతంలో దస్తగిరమ్మ ఇంటి వద్ద గల పశువుల కొట్టం దగ్గర పనులు చేసుకుంటుండగా శ్రీనివాసులరెడ్డి వెళ్లి అత్యాచారం చేసేందుకు ప్రయత్నించాడని చెప్పారు. దస్తగిరమ్మ కేకలు వేయడంతో గ్రామస్తులు అక్కడి వచ్చిన కాపాడారన్నారు. ఈ ఘటనపై బాధితురాలు దస్తగిరమ్మ ఫిర్యాదు మేరకు అత్యాచారయత్నం కేసు నమోదు చేసినట్లు వివరించారు.